# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ 02.07.2025 | 24 క్యారెట్లు 1,00.750 | కిలో వెండి 1,20,000 | 26 °C | సంపుటి:3 | సంచిక:184

www.vishalabharati.com


## జైలుకు భయపడితే తెలంగాణ వచ్చేదా?



ప్రజల తరఫున ప్రశ్నిస్తం..
హామీల అమలుపై నిలదీస్తం

2

హామీలపై సోషల్ మీడియాలో ప్రశ్నించిన యువకుడిని రాత్రివేళ తలుపులు పగులగొట్టి అరెస్టు చేసి తీసుకెళ్తరా?

తెలంగాణలో అప్రకటిత ఎమర్జెన్సీ మీకు కనిపిస్తలేదా?

ప్రభుత్వ నిరంకుశ చర్యలు మీ చెవికెక్కడం లేదా?

రాహుల్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలు



## దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ అంగన్‌వాడీలు

- రాష్ట్రంలోని అంగన్‌వాడీలు దేశానికే రోల్‌మోడల్‌గా నిలవాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు
- అందుకు అవసరమైన అన్నీ చర్యలు చేపట్టాలన్నారు
- పిల్లలకు పౌష్టికాహారం, అయిదేళ్ల వరకు ప్రాథమిక విద్యను అందించాలి
- సింగపూర్‌లోని నైపుణ్య శిక్షణ కేంద్రాలకు పంపి ఒప్పందం చేసుకున్నాము
- వృద్ధులకు ప్రభుత్వం అండగా నిలవాలని తెలిపారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలోని అంగన్‌వాడీలు దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచేలా తీర్చిదిద్దాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన అన్నీ చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు అయిదేళ్ల వరకు వారికి పూర్వ ప్రాథమిక విద్యను అందించి నేరుగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేలా చూడాలని సీఎం సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారిత శాఖలపై తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన సమీక్షలో పలు

మిగతా 2లో

## ఒక్కో కుటుంబానికి కోటి పరిహారం

- పాశమైలారం ప్రమాద స్థలాన్ని సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు
- ప్రమాదంపై విచారణకు అధికారులతో కమిటీ వేశామని తెలిపారు
- మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు
- యాజమాన్యంతో మాట్లాడి పరిహారం ఇప్పించాలని ఆదేశించారు
- ప్రమాదం జరిగినప్పుడు పరిశ్రమలో 143 మంది ఉన్నారని చెప్పారు
- తీవ్రంగా గాయాలైన వారికి రూ.10 లక్షలు పరిహారం
- పని చేయలేని పరిస్థితిలో ఉన్న వారికి రూ.5 లక్షలు ఇవ్వాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పాశమైలారం ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇప్పిస్తామని సీఎం రేవంత్? రెడ్డి హామీ ఇచ్చారు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి పరిహారం ఇప్పించాలని ఆదేశించారు. క్షతగాత్రులకు ఉచితంగా వైద్య చికిత్స అందిస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. బాధితుల పిల్లలను

మిగతా 2లో





## ఎందరో కార్యకర్తల త్యాగం వల్లే ఈ స్థాయికి

కలసికట్టుగా పార్టీ విజయానికి కృషి

బిజెపిలో పాత, కొత్త భేదం లేదు

స్థానిక ఎన్నికల నుంచి విజయం నమోదు చేద్దాం

యువత ,మహిళలు పార్టీలోకి రావాలి

కాంగ్రెస్ ఫేక్ యూనివర్సిటీని ఎదుర్కొంటాం

బిజెపి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రామచంద్రరావు

4



## కమిషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

మూడేళ్లకే అది కాస్తా కూలేశ్వరంగా మారింది

నీళ్లు ఫామ్ హౌజ్‌కు.. నిధులు కెసిఆర్‌కు

4

నిజామాబాద్ సభలో మంత్రి సీతక్క ఘాటు విమర్శలు

## లిఫ్ట్ పేరుతో వివాహితపై




- నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల పరిధిలో దారుణం
- ఓ ఆర్ఎంపీ వైద్యుడు వివాహితపై అత్యాచారం చేసి ఆపై హత్య చేశాడు
- లిఫ్ట్ పేరుతో బాధితురాలిని కారు ఎక్కించుకున్నాడు
- కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి అత్యాచారానికి పాల్పడ్డాడు
- అనంతరం గడ్డి మందు ఇంజెక్ట్ చేసి ఆమె ప్రాణాలు బలి తీసుకున్నాడు

4

## రాష్ట్రంలో జోరు వానలు

- తెలంగాణకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం రెయిన్ అలర్ట్ జారీ చేసింది
- అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని తెలిపింది
- కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలకు ఛాన్స్
- ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు
- మూడు రోజులపాటు ఈ వర్షాలు ఉంటాయని చెప్పారు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు

4





## ఇంద్రుడి చెంతకు.. ఇంద్రజాలికుడు

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బివి పట్టాభిరామ్ మృతి

- ఆయన వయస్సు 75 సంవత్సరాలు
- గుండెపోటుతో హఠాన్మరణం చెందారు
- సీఎం చంద్రబాబు, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం జగన్ సంతాపం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు , ఇంద్రజాలికుడు, మానసిక వైద్యుడు, హిప్నాటిస్ట్ బీవీ పట్టాభిరామ్ (75) ఇక లేరు. గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. హైదరాబాద్‌లో సోమవారం రాత్రి బీవీ పట్టాభిరామ్ గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. పట్టాభిరామ్‌కు భార్య జయ, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. ప్రజలు, అభిమానుల సందర్శనార్థం ఖైరతాబాద్‌లోని ఆయన సొంతింట్లో పట్టాభిరామ్ పార్థివదేహాన్ని బుధవారం ఉదయం 9 గంటల నుంచి

మిగతా 2లో



## శివసేనలోకి రాజాసింగ్..?

- నిన్న బీజేపీకి రాజీనామా చేసిన రాజాసింగ్
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో కమలనాథులు
- మాధవీలతతో సునీల్ బన్సల్ చర్చలు
- విక్రం గౌడ్ తో భేటీ అయిన డీకే అరుణ
- గోషామహల్‌లో పట్టుకోసం బీజేపీ యత్నాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీజేపీని వీడిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ శివసేన వైపు అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. గత కొంత కాలంగా బీజేపీ నాయకత్వం తీరును వ్యతిరేకిస్తూ వచ్చిన రాజాసింగ్ నిన్న పార్టీకి రాజీనామా చేశారు. అయితే ఆయన ప్రస్తుతం గోషామహల్ ఎమ్మెల్యేగా ఉన్నందున పార్టీ జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని రాష్ట్ర నేతలు చెబుతున్నారు. ఇదిలా ఉండగా తాను హిందుత్వ ఎజెండాతోనే ముందుకు వెళ్తానని చెప్పిన రాజాసింగ్ అదే ఎజెండా కలిగిన శివసేన పార్టీలో చేరతారని తెలుస్తోంది. ఆయన గతంలోనే శివసేనలో చేరతారని, నాందేడ్ లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. తర్వాత ఆయన బీజేపీలోనే

మిగతా 4లో

## డిగ్రీనా? ఇంజనీరింగా?

**హైదరాబాద్:** డిగ్రీలో సీటు వచ్చింది.. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు కూడా వెళ్తున్నా.. కానీ కోరుకున్న చోట, ఇష్టమైన బ్రాంచ్‌లో సీటు వస్తుందో రాదో! ఇటు డిగ్రీలో సీటు కన్‌ఫాం చేసుకోవటమా? వదిలేయటమా? లా కోర్సు వైపు వెళ్లటమా? డిగ్రీలోనే కొనసాగటమా?.. ఇదీ ఇప్పుడు ఇంటర్ పూర్తయిన విద్యార్థుల పరిస్థితి. వివిధ కోర్సుల కౌన్సెలింగ్‌ల మధ్య ఎడం భారీగా ఉంటుండటంతో విద్యార్థులు ఎటూ తేల్చుకోలేని గందరగోళ స్థితిలో పడిపోతున్నారు. రాష్ట్రంలో ఏటా దాదాపు 4 లక్షల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పూర్తి చేస్తున్నారు. వీళ్లలో 1.06 లక్షల మంది ఇంజనీరింగ్‌లో చేరుతున్నారు. దోస్త్ ద్వారా డిగ్రీ కోర్సుల్లో 2.20 లక్షల మంది చేరుతున్నారు. ఇంకో 50 వేల మంది ఇతర కోర్సుల్లోకి వెళ్తున్నారు. కొంతమంది ఇతర రాష్ట్రాలకూ వెళ్తున్నారు. ఇంటర్ ఉత్తీర్ణులంతా ఏ కోర్సులో చేరాలన్నా ఉమ్మడి ప్రవేశ పరీక్షలు రాయాలి.



# విల్లా కూల్చివేత

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

టౌన్ ప్లానింగ్ అధికారులు మణికొండ మున్సిపల్ పరిధిలోని చిత్రపురి కాలనీలో ఓ విల్లాను మంగళవారం కూల్చివేశారు. వివరాలు.. చిత్రపురి కాలనీ సొసైటీలో రెండు విల్లాలను అనుమతులు లేకుండా నిర్మించారు. అధికారులు నోటీసులు జారీ చేయగా యజమానులువారు యజమానులు కోర్టుకు ఆశ్రయించారు. స్థానికులు కొందరు విల్లాలను కూల్చివేయాలని హైడ్రా కమిషనర్ కు కూడా ఫిర్యాదు చేశారు. విల్లాలను కూల్చివేయాలని కోర్టు తీర్పు చెప్పడంతో హైడ్రా కమిషనర్ ఆదేశాలతో మణికొండ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ సింగ్ ఆధ్వర్యంలో మంగళవారం ఓ విల్లాను నేలమట్టం చేశారు. మధ్యాహ్నం వరకు ఒక విల్లాను పూర్తిగా కూల్చివేశారు. అనంతరం మరో విల్లాను కూల్చి వేయడానికి భారీ హిటాచి తో వెళ్లారు. ఓ వృద్ధురాలు మహిళ చిన్నారి ఉన్నారు. అందులో నుంచి సామాగ్రి తరలించలేదు. ఇప్పటికిప్పుడే ఖాళీ చేయాలంటే వృద్ధురాలికి ఇబ్బందిగా ఉందని, ఈ విషయంలో సాయం చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ సింగును చిత్రపురి కాలనీ సొసైటీ కమిటీ సభ్యుడు అలహరి కోరారు. దీంతో బుధవారం ఉదయం వరకు సమయం ఇస్తున్నామని ఆ తర్వాత కూల్చివేస్తామని చెప్పారు. బాధిత వృద్ధురాలు మరో ఇంట్లోకి మారడానికి ఏర్పాట్లు చేస్తామని అలహరి తెలిపారు.

# ఇంద్రుడి చెంతకు.. ఇంద్రజాలికుడు

మొదటి పేజీ తరువాయి

ఉంచనున్నారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో బీవీ పట్టాభిరామ్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. బీవీ పట్టాభిరామ్ పూర్తి పేరు.. భావరాజు వెంకట పట్టాభిరామ్. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారు. తండ్రి పేరు భావరాజు సత్యనారాయణ. పదిహేను మంది సంతానంలో బీవీ పట్టాభిరామ్ కూడా ఒకరు. చిన్నప్పుడు కాలి వైకల్యం కారణంగా బీవీ పట్టాభిరామ్ ఆత్మన్యూనతా భావంతో బాధపడేవారు. అయితే దానిని జయించి రచయితగా, ఇంద్రజాలికుడిగా, మానసిక వైద్యుడిగా, వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా.. ఇలా బహుముఖ ప్రజ్ఞాశీలిగా ఎదిగారు. అయితే మ్యాజిక్‌లో ఆయన మ్యాజిక్ ప్రపంచానికి తెలిసింది మాత్రం.1984లో. కళ్లకు గంతలు కట్టుకుని హైదరాబాద్ రవీంద్రభారతి నుంచి చార్మినార్ వరకు స్కూటర్ నడిపి బీవీ పట్టాభిరామ్ కొత్త అధ్యాయాన్ని సృష్టించారు. బీవీ పట్టాభిరామ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఫిలాసఫీలో, నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి సైకాలజీలో పీహెచ్‌డీ పొందారు. హిప్నోటిజం, సాఫ్ట్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంపై వర్క్‌షాప్‌లు నిర్వహించారు. చాణక్య తంత్రం, పాజిటివ్ థింకింగ్, మైండ్ మ్యాజిక్, గుడ్ పేరెంట్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, మాయవినోదం, మాటే మంత్రం, బంగారు బాట వంటి రచనలు చేశారు. మూఢనమ్మకాలు, మద్యపానం వలన కలిగే అనర్థాలు వివరిస్తూ ప్రచారం చేశారు. కొన్ని టీవీ సీరియళ్లతో పాటుగా.. రెండురెళ్లు ఆరు అనే సినిమాలోనూ ఆయన నటించారు.

**బీవీ పట్టాభిరామ్ మృతిపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి జగన్ సంతాపం...**

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ మరణంపై సీఎం చంద్రబాబు నాయుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బీవీ పట్టాభిరామ్ ఆకస్మిక మృతి తనను బాధించిందన్న చంద్రబాబు.. వ్యక్తిత్వ వికాస బోధనలతో, రచనలతో ఎంతో మందిని ప్రభావితం చేసిన బీవీ పట్టాభిరామ్ అన్నారు. ఆయన మృతి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చంద్రబాబు ట్వీట్ చేశారు. బీవీ పట్టాభిరామ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# జైలుకు భయపడితే తెలంగాణ వచ్చేదా?

**హైదరాబాద్:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించిన యువకుడిని పోలీసులు రాత్రివేళ ఇంట్లోకి చొరబడి అరాచకం సృష్టించి అరెస్ట్ చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ సర్కారు కరడుగట్టిన నేరగాడిని పట్టుకున్నట్టు, రాత్రి వేళ తలుపులు బద్దలుకొట్టి, తినే అన్నం నేలకు కొట్టినట్టుగా వ్యవహరించి అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని నిత్యం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కండ్లకు తెలంగాణలో అమలవుతున్న అప్రకటిత ఎమర్జెన్సీ కానరావడం లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ చర్యలు ఆయన చెవికి వినపడటం లేదా? అని నిలదీశారు. 'కేసులకు భయపడితే తెలంగాణ వచ్చేదా? చెరసాలకు భయపడితే తెలంగాణ వచ్చేదా?' అని మంగళవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

**అతను ఎవరి మీదా దాడి చేయలే**

'అతను హత్య చేయలేదు.. అతను దొంగతనం చేయలేదు.. అతను ఎవరి మీదా దాడి చేయలేదు.. అతను తీవ్రవాది కాదు.. అతను మావోయిస్టు కాదు.. అతను మావోయిస్టుల సానుభూతిపరుడు కూడా కాదు.. అతను మాజీ నేరస్థుడు కానే కాదు.. అతను శాంతిభద్రతలకు ఎకడా విఘాతం కలిగించలేదు.. అతను శాంతిభద్రతలు భంగం కలిగించేలా ఎవరినీ రెచ్చగొట్టలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సోషల్ మీడియా వేదికగా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తున్నడు.. హామీల అమలు గురించి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను రీపోస్ట్ చేస్తున్నాడు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కరడుగట్టిన నేరగాడిని పట్టుకున్నట్టు రాత్రి వేళ తలుపులు పగలగొట్టి అరెస్టు చేసింది. హత్యాయత్నం చేసిన వ్యక్తి, హత్య




చేసిన వ్యక్తి ఎకడ తన పలుకుబడిని ఉపయోగించి సాక్ష్యాలను మాయం చేస్తాడో అన్నట్టు, సాక్షులను ప్రభావితం చేస్తాడో అన్నట్టు.. ఎవరినీ కలవనివ్వకుండా పారిపోతాడన్నట్టు.. పదుల సంఖ్యలో పోలీసులను మోహరించి తన కర్కశత్వాన్ని ప్రదర్శించింది. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని నిత్యం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే రాహుల్‌గాంధీ.. తెలంగాణలో అమలవుతున్న అప్రకటిత ఎమర్జెన్సీ మీ కండ్లకు కనిపించడం లేదా? మీ కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ చర్యలు మీ చెవికి వినపడడం లేదా?' అని నిలదీశారు. 'ప్రజల తరఫున ప్రశ్నిస్తం. హామీల అమలుపై నిలదీస్తం' అని స్పష్టంచేశారు.



# ఒక్కో కుటుంబానికి రూ.కోటి పరిహారం



మొదటి పేజీ తరువాయి

చదివించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టంగా చెప్పారు. సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ పరిశ్రమ ప్రమాద స్థలాన్ని సీఎం రేవంత్? రెడ్డి పరిశీలించారు. ఈ ప్రమాదంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై విచారణకు అధికారులతో కమిటీ వేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. కమిటీ నివేదిక మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణకు స్పష్టమైన వ్యవస్థ తీసుకొస్తామని వెల్లడించారు. ఇలాంటివి జరగకుండా పరిశ్రమలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమల్లో తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఖర్చుతో మృతదేహాలను స్వస్థలాలకు తరలిస్తామని చెప్పారు.



ఈ ప్రమాదంపై కారణాలు ఇప్పుడే చెప్పలేమని సీఎం రేవంత్? రెడ్డి అన్నారు. ప్రమాద ఘటనపై నిపుణుల కమిటీతో దర్యాప్తు చేయిస్తున్నామని వివరించారు. మృతుల కుటుంబాలకు రూ.లక్ష, క్షతగాత్రులకు రూ.50 వేల తక్షణ సాయం ప్రకటించామన్నారు. ప్రమాదం జరిగినప్పుడు పరిశ్రమలో 143 మంది ఉన్నారని చెప్పారు. ఇప్పటివరకు 36 మంది కార్మికులు చనిపోయారని, 58 మంది కార్మికులు అధికారులతో టచ్?లోకి వచ్చారని తెలిపారు. ఏది ఏమైనా ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోంది. దీనికి సంబంధించి చనిపోయిన కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇప్పించాలి కంపెనీ వాళ్లతో మాట్లాడి, అలాగే ప్రభుత్వం, కంపెనీ నుంచి రూ.కోటి పరిహారం ఇవ్వాలని ఆదేశించాను. ఆదేశాల ప్రకారం మంత్రులు కంపెనీ అధికారులతో మాట్లాడి ప్రభుత్వం వైపు నుంచి సహకారం తీసుకొని పరిహారం అందించడం జరుగుతోంది. అదే విధంగా తీవ్రంగా గాయాలైన వారికి పని చేయలేని పరిస్థితి ఉన్న వారికి రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని, అదేవిధంగా కొంతమొత్తంలో దెబ్బలు తగిలి పని చేయలేని పరిస్థితిలో ఉన్న వారికి రూ.5 లక్షలు ఇవ్వాలి. క్షతగాత్రులకు పరిశ్రమ యజమానులు, ప్రభుత్వం కలిసి చర్యలు తీసుకుంటాయి సీఎం వెల్లడించారు. కొందరు కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారని భావిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రమాదం జరిగిన తర్వాత కొందరు వెళ్లిపోయారని భావిస్తున్నామని వెల్లడించారు. తీవ్రంగా గాయపడి పని చేసుకోలేని వారికి రూ.10 లక్షల పరిహారం, గాయపడి చికిత్స తర్వాత పని చేసుకోగలిగిన వారికి రూ.5 లక్షల పరిహారం చెల్లించనున్నామన్నారు. క్షతగాత్రులకు చికిత్స ఖర్చును కంపెనీ, ప్రభుత్వం భరిస్తామని స్పష్టం చేశారు. బాధితుల పిల్లల చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. బాధితుల పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తామని మాటిచ్చారు. సోమవారం ఉదయం నుంచి మంత్రులు రాజనర్సింహ, వివేక్? ఘటనా స్థలాన్ని పర్యవేక్షిస్తున్నారని సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. అత్యంత విషాదకరమైన ఘటన సోమవారం జరిగిందన్నారు. ఉమ్మడి ఏపీ, రాష్ట్ర చరిత్రలో ఇంతటి ప్రమాదం ఎప్పుడూ జరగలేదని పేర్కొన్నారు. బిహార్?, ఒడిశా, మధ్యప్రదేశ్?, ఏపీ కార్మికులు ఉన్నారని, ఇప్పటి వరకు 36 మంది మరణించారని వివరించారు. ఇంకా కొందరు కార్మికుల ఆచూకీ తెలియడం లేదన్నారు. శిథిలాల కింద ఎవరైనా ఉన్నారా అనేది తెలుసుకుంటున్నామని చెప్పారు.

# దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ అంగన్‌వాడీలు

మొదటి పేజీ తరువాయి

కీలక సూచనలు చేశారు.

**అంగన్‌వాడీల రూపురేఖలు మార్చాలి..**

రాష్ట్రంలో అంగన్ వాడీలకు ప్రత్యేక గుర్తింపు కలిగి ఉండాలనే ఉద్దేశంతో అంగన్‌వాడీలకు నూతన భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. అంతే కాదు ఇప్పుడున్న 5వేల చిన్న అంగన్ వాడీ కేంద్రాలను అప్‌డేట్ చేస్తూ పెద్ద అంగన్ వాడీ కేంద్రాల్లో కలిపారు. ఇక అంగన్ వాడి భవనాల విషయంలో అధునాతన సాంకేతికతను వినియోగించుకోవాలని, పిల్లల అవసరాలకు తగినట్లు కంటైనర్లతో డిజైన్ చేయించే అంశాన్ని అధ్యయనం చేయించాలని సీఎం పేర్కొన్నారు. సోలార్ ప్లేట్లు, బ్యాటరీ బ్యాకప్‌తో కంటైనర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తే తక్కువ వ్యయం, ఎక్కువ సౌకర్యం ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ఉన్న కంటైనర్ కేంద్రాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు.

**ఎన్జీవోల సేవలు వినియోగించుకోమని..**

అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రతి పిల్లవానికి పౌష్టికాహారం అందించాలని.. ఇందుకు ఎన్జీవోల సేవలు వినియోగించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బాలామృతం ప్లస్‌ను పెద్ద మొత్తంలో ఇచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. కర్ణాటకలో జొన్న రొట్టెలను వినియోగిస్తున్నారని, పౌష్టికాహార నిపుణులతో చర్చించి వాటిని మహిళా సంఘాలతో పిల్లలకు అందించే అంశంపైనా దృష్టిసారించాలని సీఎం తెలిపారు. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందజేత, అంగన్‌వాడీల పర్యవేక్షణ, నిర్వహణపై వంద రోజుల కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని రేవంత్ రెడ్డి కోరారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం విషయంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు కలిసే పని చేయాలని సీఎం అన్నారు. అనాథ పిల్లలకు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కల్పిస్తున్నారని, అదే సమయంలో ఏటీసీల్లోనూ వాళ్లకు ప్రవేశాలు కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

**తెలంగాణ ఫుడ్ ప్రొడక్ట్ ద్వారానే అంగన్ వాడీలకు**

మన పిల్లలను సింగపూర్‌లోని నైపుణ్య శిక్షణ కేంద్రాలకు పంపే ఒప్పందం చేసుకున్నామని, అక్కడకు పంపే



వారిలో అనాథ పిల్లలకు చోటు కల్పించాలని సీఎం ఆదేశించారు. ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని మురికివాడలు, వలస కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని పిల్లల కోసం మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నిర్దేశిత సమయంలో అక్కడి పిల్లలకు ఆయా వాహనాల ద్వారా పౌష్టికాహారం అందేలా చూడాలని సీఎం ఆదేశించారు. విశ్రాంత ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు ఆయా పిల్లలకు బోధన చేసేందుకు ఆసక్తి చూపితే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. తెలంగాణ ఫుడ్స్, విజయా డెయిరీ ఉత్పత్తులను అంగన్‌వాడీలకు అందేలా చూడాలని సీఎం అన్నారు.

**వృద్ధులకు భరోసా..**

ఉద్యోగాలు చేస్తున్న పలువురు తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, అటువంటి వృద్ధులకు ప్రభుత్వం అండగా నిలవాల్సి ఉందని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల వేతనాల నుంచి నేరుగా వారి తల్లిదండ్రులకు ఖాతాలకు 10-15 శాతం జమ అయ్యే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. అస్సాంలో ఇప్పటికే అటువంటి పథకం అమలవుతోందని.. ఇతర రాష్ట్రాల్లో ఇంకా అటువంటివి ఏవైనా ఉంటే పరిశీలించి ఒక నివేదిక సమర్పించాలని కోరారు. ట్రాన్స్‌జెండర్లకు ప్రస్తుతం ట్రాఫిక్ విభాగంలో అవకాశం కల్పించామని.. వారి సేవలను రవాణా, దేవాదాయ శాఖ, వైద్యారోగ్య శాఖలతో పాటు ఐటీ, ఇతర కంపెనీల సేవల్లో వినియోగించుకునేలా చూడాలని సీఎం ఆదేశించారు.

**తెలంగాణ రైజింగ్‌లో..**

తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంట్‌లో చిన్నారులు, మహిళలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై విధానాలు రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దివ్యాంగుల మధ్య వివాహాలు, వివిధ పథకాల్లో దివ్యాంగులకు ప్రోత్సాహకాలు కల్పించే విషయంపై అధ్యయం చేసి వచ్చే క్యాబినెట్ సమావేశం నాటికి నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమీక్షలో మంత్రులు సీతక్క,పొన్నం ప్రభాకర్ తో పాటు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చిత్రా రామచంద్రన్ పాల్గొన్నారు.

## ఖైదీల వివరాలు పంచుకున్న భారత్, పాక్

**న్యూఢిల్లీ:** భారత్, పాకిస్థాన్‌లు తమ కస్టడీలో ఉన్న పౌర ఖైదీలు, మత్స్యకారుల వివరాల జాబితాలను మంగళవారం పరస్పరం మార్పిడి చేసుకున్నాయి. వీటి ప్రకారం ప్రస్తుతం పాక్ చెరలో భారతీయులు, భారతీయులుగా పరిగణిస్తున్న 246 మంది పేర్లను వెల్లడించింది. వారిలో 53 మంది పౌర ఖైదీలు, 193 మంది మత్స్యకారులు ఉన్నారు. ఇస్లామాబాద్ లోని భారత హైకమిషన్‌కు పాక్ ప్రభుత్వం ఈ వివరాలు అందించిందని విదేశాంగ శాఖ వెల్లడించింది. వారిని త్వరగా విడుదల చేసి స్వదేశానికి పంపించాలని భారత ప్రభుత్వం ఈ సందర్భంగా పాక్‌ను కోరింది. అదే సమయంలో భారత్ కూడా తమ జైళ్లలో ఉన్న పాక్ ఖైదీల వివరాలున్న జాబితాను ఢిల్లీ లోని పాక్ హైకమిషన్‌కు అందించింది. మన అదుపులో పాక్ జాతీయులు, పాక్‌జాతీయులుగా పరిగణిస్తోన్న వారు 463 మంది ఉన్నారు. అందులో 382 మంది పౌర ఖైదీలు కాగా, 81 మంది జాలర్లు. 2008లో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇరు దేశాలు .ఏటా రెండుసార్లు జనవరి 1, జులై 1 దౌత్యమార్గాల ద్వారా ఈ వివరాలను పరస్పరం పంచుకుంటాయి.



## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

**మణుగూరు, విశాలభారతి:**

మేముసైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం నాడు ఘనంగా నిర్వహి ంచారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఆంధ్ర ప్రభ రెండు తెలుగు రాష్ట్రాల చీఫ్ జనరల్ వె నేజర్ పసునూరి భాస్కర్ ఆదేశాల మేరకు పట్ట ణంలోని వేణు రెస్టారెంట్ మినీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన జాతీయ వైద్యుల దినోత్సవానికి ముఖ్య అతిథులుగా మణుగూరు తహశీల్దార్ అద్దంకి నరేష్. సిఐ పాటి నాగబాబు, సివిల్ సప్ల య్ డిటి శివకుమార్లు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ మేము సైతం మిత్ర మండలి ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్య క్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. జాతీయ విపత్కర పరిస్థితుల్లో కరోనా బారిన పడి ఎందరో ఇబ్బం దులకు గురికాగా, సేవలందిం చాలనే సంకల్పంతో వ్యవస్థాపకులు పసునూరి భాస్కర్ ట్రస్ను ఏర్పాటు చేయడం సంతో షదాయకమన్నారు.



## హిమాయత్ సాగర్ లో దూకి వ్యక్తి ఆత్మహత్య

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

హిమాయత్ సాగర్ చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. వివరాల ప్రకారం.. బండ్లగూడ మున్సిపల్ హిమాయత్ సాగర్ కు చెందిన ముఖేష్(32) ఏటీఎం సెంటర్ల వద్ద మాటు వేసి అమాయకుల నుంచి డబ్బులు తీసుకుంటాడు. ఇటీవల 75,000 తీసుకున్నాడు. ముఖేష్ దొంగతనాలు చేయడంతో కానిస్టేబుల్ అయిన అతని భార్య కొంతకాలంగా విడిగా ఉంటుంది. తనను ఎవరు పట్టించుకోవడంలేదని మనస్థాపం చెందిన ముఖేష్ సోమవారం హిమాయత్ సాగర్లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం మృతదేహం నీళ్లపై తేలడంతో విషయం వెలుగు చూసింది. ముఖేష్ ను అతడి స్నేహితులు హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు బంధువులు ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ క్యాస్ట్రో మంగళవారం తెలిపారు.



## బంగారం మైసమ్మను దర్శించుకున్న రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా నార్సింగ్ మండలంలోని కోకాపేటలో కొలువైయున్న బంగారు మైసమ్మ ఏడవ వార్షికోత్సవ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులై సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకున్న రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను అమ్మవారు చల్లంగా చూడాలని ఆమె దీవెనలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించే విధంగా అమ్మవారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన అమ్మవారిని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, గుడిమల్కాపూర్ డైరెక్టర్ ఓం ప్రకాష్ రెడ్డి,ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒక చేత్తో బిజెపి జెండా.. మరో చేత్తో కూటమి అజెండా

**విజయవాడ:** బీజేపీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా చేసేలా పని చేస్తానని ఏపీ రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలను చేపట్టిన పీవీఎన్ మాధవ్ అన్నారు. ఒక చేతిలో బీజేపీ జెండా, మరో చేతిలో కూటమి అజెండాతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలను మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మంగలశారం స్వీకరించారు. ఈ పదవికి ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ బీజేపీ అధ్యక్ష బాధ్యతలను రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి మాధవ్‌కు అప్పగించారు. బీజేపీ ఏపీ అధ్యక్ష పదవి బాధ్యతలను స్వీకరించిన అనంతరం పీవీఎన్ మాధవ్ మాట్లాడారు. 'నేను రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తున్నాను. పార్టీ, తను వేరు కాకుండా మా నాన్నగారు పని చేశారు. అత్యంత సాధారణంగా పని చేస్తున్న ప్రతీ కార్యకర్త పర్యటన ద్వారా కార్యక్రమాలు చేస్తారు. పదవి ఒక బాధ్యత అని సంఘంలో నేర్పించారు. బీజేపీని రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా చేసేలా పని చేస్తాను.



ఆర్ఎస్ఎస్ ప్రారంభం అయ్యి 100 సంవత్సరాలు పూర్తయిన సంవత్సరం 2025. ఎమ్జర్జ÷న్సీకి 50 సంవత్సరాలు పూర్తయిన సంవత్సరం 2025. 2025లో అధ్యక్షుడిగా నేను బాధ్యతలు తీసుకోవడం నాకు ఆనందదాయకం. బాషా మధ్యమాన్ని రద్దు చేసి గత ప్రభుత్వం కళంకాన్ని తెచ్చింది. తెలుగును శాసన భాషగా తయారు చేసేలా పని చేస్తాం. ఒక చేతిలో బీజేపీ జెండా, మరో చేతిలో కూటమి అజెండాతో ముందుకు వెళ్ళాలి. యోగాంధ్రను ముందుకు తీసుకువెళ్ళాలి' అని మాధవ్ అన్నారు.

## రాష్ట్ర స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించండి

**రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి**

**తక్షణమే సంక్షేమ (వెల్ఫేర్) బోర్డు ఏర్పాటు చేయాలి.**

**జీవో నెంబర్ 272 ను సవరణ చేయాలి.**

**50 సంవత్సరాల నిండిన స్వర్ణకారులకు పెన్షన్ లను అమలు చేయాలి**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**



రాష్ట్రంలో ఉన్న స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించాలని తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వృత్తి పని లేక చాలామంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తక్షణమేప్రభుత్వం స్పందించాలని లేనియెడల మా సమస్యలను పరిష్కారమయ్యేంతవరకు ప్రత్యేక కార్యాచరణ ప్రకటించవలసి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన వారిలో విశ్వబ్రాహ్మణ స్వర్ణకారుల పాత్ర గణనీయమైందని ఆయన అన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలను అర్పించిన విశ్వబ్రాహ్మణుల స్వర్ణకారులను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం సరైనది కాదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మాకు న్యాయం జరుగుతుందని అనుకున్నాం కానీ గత పాలకులు 10 సంవత్సరాలు పరిపాలన చేసి స్వర్ణకారులకు మొండి చేయి చూపించారని అందుకే ఎన్నికల్లో ఓటమి రుచి చూపించామని ఆయన అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరకాలం కావస్తుంది అయినా మా సమస్యలను మాత్రం పట్టించుకోవట్లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే స్వర్ణకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాల నిండిన ప్రతి స్వర్ణకారుడికి పెన్షన్ లు మంజూరు చేయాలని, జీవో నెంబర్ 272 ను సవరణ చేసి అమలు చేయాలని, వృత్తి పనులు లేక ఆత్మహత్య చేసుకున్న స్వర్ణకారులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశాడు. అదేవిధంగా ప్రతి పని లేక ఇబ్బంది పడుతున్న వారికి పని కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మా సమస్యలు పరిష్కరించని ఎడల స్థానిక సంస్థల్లో ఓటు ద్వారా ఈ ప్రభుత్వానికి మా సత్తా చూపిస్తామని ఆయన అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గౌరోజు రత్నమాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామదాసు లక్ష్మణచారి, రాష్ట్ర కార్యదర్శులు రాగిఫణి సతీష్ చారి, వింజమూరి వెంకటాచారి, రాష్ట్ర ప్రచార కార్యదర్శులు పుతకమూరి రమేష్ చారి, పోతులూరిచారి,పెరికేటి నాగరాజు చారి, రాజనర్సింహ, పున్నోజు రామకృష్ణ,మండలోజు భీష్మ చారి,మహేశ్వరం గోవర్ధన్, సంతోష్ నగర్ సంఘం అధ్యక్షుడు కోటగుర్రం నాగరాజు చారి, అంజయ్య చారి, దామోదరాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఎఐఐఇఎ అసోసియేషన్ 75వ స్థాపన దినోత్సవం

**చౌటుప్పల్, విశాలభారతి:**

ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ), ఇన్సూరెన్స్ రంగంలో ని ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న మెజారిటీ ట్రేడ్ యూనియన్, జులై 1 నుండి ప్లాటినం జూబిలీ వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా,75వ స్థాపన దినోత్సవాన్ని ఈ రోజు, జూలై 1, 2025న దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటోంది. 1951లో స్థాపితమైన ఏఐఐఈఏ, ఎల్ఐసి కి ముందే ఏర్పడి,గత 75 సంవత్సరాలలో బీమా రంగ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి అంకితంగా పనిచేస్తోంది.అనేక వేతన సవరణలు,ఉద్యోగ భద్రత సాధనలు,ఎల్ఐసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విజయవంతమైన పోరాటాలు,మహిళా ఉద్యోగుల ప్రోత్సాహం,యువతను ఉద్యమంలో చేర్చడం వంటి ఎన్నో చారిత్రాత్మక విజయాలు ఈ ఉద్యమ పయనంలో చోటుచేసుకున్నాయి.ఈ సందర్భంగా చౌటుప్పల్ శాఖ




ప్రెసిడెంట్ కామ్రేడ్ రమేష్ మాట్లాడుతూ,ఇంతటి చారిత్రాత్మక స్థానాన్ని పొందడానికి కామ్రేడ్ చంద్రశేఖర్ బోస్,సునిల్ మైత్ర, సరోజ్ చౌదరి,ఎన్.ఎమ్.సుందరం మరియు మన్‌చందా వంటి వారందరి త్యాగాలు నిక్షిప్తమై ఉన్నయనీ,వారి తర్వాత తరాలు కూడా అదే ప్రస్థానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కామ్రేడ్ భాస్కర్ రాజు,ప్రధాన కార్యదర్శి చౌటుప్పల్ శాఖ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న బ్రాంచ్‌లలో జెండా ఆవిష్కరణ, బ్యానర్ ఆవిష్కరణ,ప్రచోదక ప్రసంగాలు వంటి కార్యక్రమాలు నిర్వహించబడ్డాయనీ,అలాగే ఏఐఐఈఏ తన మూల్యాలైన సమానత్వం,సామూహిక శక్తి, ప్రభుత్వ రంగ పరిరక్షణ పట్ల తన కట్టుబాటును మరోసారి పునరుద్ఘాటిస్తూ,డిజిటల్ యుగంలో కూడా ఎల్ఐసి ను ప్రజాధనంగా నిలబెట్టేందుకు మరియు కార్మిక ఐక్యతను మరింత బలోపేతం చేయడానికి ఉద్యోగులందరినీ పునఃసంకల్పానికి పిలుపునిస్తోందనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ శాఖ ఎల్ఐసి ఆఫీసు ఉద్యోగులు మరియు ఏజెంట్ మిత్రులు పాల్గొని విజయవంతం చేశారు.

## హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి దారుణ హత్య

**ఆస్తి తగదాల్లో భాగంగా పిడి గుద్దులు గుద్ది హతమార్చిన సోదరుడు, అతని కుమారుడు**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆస్తి తగదాల్లో భాగంగా తన సోదరుడు అతని కుమారుడు కలిసి ఒక వ్యక్తి ని పిడి గుద్దులు గుద్ది హతమార్చిన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా,నారాయణపూర్ మండలం,డాకు తండాకు చెందిన కారంతోత్ లోఖా, కారంతోత్ రఘు తో పాటు కారంతోత్ బుగ్గ అనే ముగ్గురు అన్నదమ్ములు అని వారు గత 20 సంవత్సరాలనుండి బంజారా కాలనీ అంబేద్కర్ నగర్ లో నివాసం ఉంటున్నట్లు వారికీ స్వగృహం లో 60



గుంటల వ్యవసాయ భూమికి సంబంధించి వారి మధ్య సివిల్ తాగదలు కొనసాగుతున్నట్లు తెలిపారు, కొన్ని రోజుల క్రితం కారంతోత్ లోఖా తన సోదరులకు తెలియకుండా తన పేరు మీద ఒక ఎకరం భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు, తరువాత భూగ్గ పేరు మీద మిగిలిన సగం భూమిని రిజిస్ట్రేషన్ చేయడానికి తను అంగుకరించాడు,కానీ ఈ రోజు ఉదయం రిజిస్ట్రేషన్ విషయం పై మాట్లాడడానికి వచ్చిన రఘు లోఖా ఇంటికి వచ్చినట్లు తెలిపారు, కానీ లోఖా అక్కడ లేడు, రఘు భూగ్గ ఇంటికి పరిగెత్తిన తరువాత కొన్ని కారణాల వాళ్ళ గొడవలు జరిగాయి, భూగ్గ అతని కుమారుడు అనిల్ రఘును తమ చేతులతో పిడి గుద్దులు గుద్దడంతో అతను కుప్పకూలిపోయాడు, ఆ తర్వాత రఘును షాడో హాస్పిటల్ కి వెంటనే తరలించడం జరిగింది. అక్కడ ఉన్నటువంటి వైద్యులు పరిశీలించిన డాక్టర్ అతను చనిపోయినట్లు ప్రకటించారు, అతని మృత దేహాన్ని ఉస్మానియా హాస్పిటల్ మార్చురికి తరలించినట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హత్యకు కారణమైన వ్యక్తులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## చేపల బోన్‌లెస్ తో ఆరోగ్యకరమైన ఆహారం

**కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**మణుగూరు, విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక ఫిష్ వ్యాపారులు, మత్స్యకారులతో కలిసి "చేపలను బోన్‌లెస్‌గా (ముళ్లు లేకుండా) తయారు చేసే విధానం" పై ప్రత్యక్ష ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. ఈ విధంగా చేపలను బోన్‌లెస్‌గా తయారు చేయడం ద్వారా వాటి మార్కెట్ విలువ పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ విధానం నేర్చుకోవడం ద్వారా మత్స్యకారులు, ఆదివాసీ సముదాయాలు, చేపలపై



ఆధారపడి జీవించే కుటుంబాలు, ఎస్. హెచ్. జీ మహిళలు తమ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. బోన్‌లెస్ చేప ముక్కలను పిల్లలు, పెద్దలు సులభంగా తినగలిగే విధంగా ఉండటంతో మంచి పోషకాహారం అందించే అవకాశం ఉందని వివరించారు. బోన్‌లెస్ చేప ముక్కల ద్వారా చికెన్ టిక్కా లాంటి రక రకాల వంటకాలు, ఐటమ్స్ తయారు చేసి, చేపలకు కొత్త విలువ చేర్చవచ్చని తెలిపారు. తద్వారా చేపలను తినే ప్రజలకు కొత్త రుచులు అందించడం, ఆదాయాన్ని పెంచుకోవడం సాధ్యమవుతుందన్నారు. అలాగే, చేపల తలలు మరియు మిగిలిన భాగాలతో పోషక విలువ గల రుచికరమైన సూప్ తయారు చేసి జిల్లావాసులకు అందించడం ద్వారా ఆరోగ్యం, ఆదాయం రెండూ సంపాదించుకోవచ్చునని అన్నారు. అలాగే మిగిలిన వ్యర్థాలను ఎరువుగా వాడటం ద్వారా పర్యావరణం పరిరక్షణతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

బుధవారం
2.07.2025
హైదరాబాద్

epaper:vishalabharati.com
www.vishalabharati.com

vishalabharathi Telugu Daily

GENERAL NEWS




## ట్యూషన్ ఫీజులపై తెలంగాణ సర్కారు స్పష్టత

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రొఫెషనల్ కాలేజీల్లోని అన్ని కోర్సుల ట్యూషన్ ఫీజులపై సర్కారు స్పష్టత ఇచ్చింది. 2025-26 విద్యా సంవత్సరంలో పాత ఫీజులే ఉంటాయని వెల్లడించింది. బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు 2022-25 బ్లాక్ పీరియడ్ ఫీజులే ఈ ఏడాది అమలవుతాయని ఉత్తర్వులు జారీ చేసింది. 2025-28 (మూడేళ్లు) బ్లాక్ పీరియడ్‌లో ఫీజుల సవరణకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) కాలేజీల వారీగా ప్రతిపాదనలు స్వీకరించి, ప్రత్యక్ష విచారణలు జరిపింది. అనంతరం ఫీజులను కూడా ఖరారు చేసింది. అయితే ఫీజులను అధికారికంగా ధ్రువీకరిస్తూ జీవో జారీ చేయాల్సిన తరుణంలో ప్రభుత్వం ఫీజుల సవరణకు బ్రేకులు వేసింది. కొన్ని కాలేజీల్లో ఫీజులు ఆసాధారణంగా పెరగడంపై సర్కారు అభ్యంతరాలు వ్యక్తం చేసింది.




# ఎందరో కార్యకర్తల త్యాగం వల్లే ఈ స్థాయికి

**హైదరాబాద్:** ఎంతో మంది కార్యకర్తల త్యాగాల ఫలితంతోనే బీజేపీ ఈ స్థాయికి చేరుకుందని బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. తనకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వడం గర్వంగా భావిస్తున్నాను.. ప్రతి కార్యకర్త గర్వించాలి.. అందరం కలిసికట్టుగా పని చేద్దాం అని పిలుపునిచ్చారు. తాను పేరుకే అధ్యక్షుడిని.. నేనెప్పటికీ కార్యకర్తనే.. మీ సేవకుడినే పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కిషన్ రెడ్డి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ.. కార్యకర్తలే ఈ పార్టీకి నిజమైన సారథులు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జనసంఘ్ అభ్యర్థి పోటీ చేస్తే వెయ్యి ఓట్లు మాత్రమే వచ్చాయి.. కమ్యూనిస్టు పార్టీ గెలిచింది.. ఆనాడు జనసంఘ్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు టపాసులు కాల్చారు.. ఇదేందని కమ్యూనిస్టులు అడిగితే గత ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయని సంబురాలు చేసుకుంటున్నామని చెప్పారు.. ఇవాళ అదే ఉత్సాహంతో తెలంగాణలో 8 ఎమ్మెల్యే, 8 ఎంపీ, 3 ఎమ్మెల్సీ సీట్లను కైవసం చేసుకున్నామని రామచందర్ రావు తెలిపారు. అయితే, పార్టీ కోసం సైకిల్ పై రాష్ట్రమంతటా తిరుగుతూ ఎంతో కష్టపడ్డామని టీబీజేపీ చీఫ్ రామచందర్ రావు పేర్కొన్నారు. బీజేపీ ఈ స్థాయికి వచ్చిందంటే.. ఎంతో మంది కార్యకర్తలు, నాయకులు త్యాగాలున్నాయి.. మీ చెమట కష్టంతోనే బీజేపీ ఎదిగింది.. అందరి ఆశీస్సులతో నేను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికవడం గర్వంగా ఉంది.. ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. నక్సలైట్ల తూటాలకు బలైన బీజేపీ నాయకుల బలిదానాల వల్లే పార్టీ ఈ స్థాయికి ఎదిగింది.. బీజేపీ మాస్ క్యాడర్ పార్టీ, సిద్ధాంత బలమున్న పార్టీ.. కలిసికట్టుగా గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరేద్దామని తెలిపారు. బీజేపీలో కొత్త, పాత అనే పంచాయతీ లేదు.. నది ప్రవహించాలంటే కొత్త నీరు రావాల్సిందే అన్నారు. తెలంగాణ యువత రాజకీయాల్లోకి రావాల్సిందే అని రామచందర్ రావు పిలుపునిచ్చారు. ఇక, యువకులారా.. మహిళలారా.. బీజేపీలోకి రండి అంటూ రామచందర్ రావు పిలుపునిచ్చారు. 33 శాతం రిజర్వేషన్ల అమలుతో మహిళలకు ఎన్నో అవకాశాలు రాబోతున్నాయి.. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు.. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు గెలుపే లక్ష్యంగా పని చేస్తాను.. బీఆర్ఎస్, కాంగ్రెస్ వాట్సాప్ యూనివర్శిటీలను పెట్టుకుని ఫేక్ న్యూస్ ను ట్రోలింగ్ చేస్తున్నారు.. స్వామి వివేకానంద చెప్పిన మాటలను గుర్తు తెచ్చుకుని పోరాడుదాం.. మీకు దమ్ముంటే.. నేరుగా ఎదురుగా పోరాడదాం.. నేను క్రిమినల్ లాయర్ ను.. ఫేక్ న్యూస్ సూత్రధారులను బోనులో నిలబెట్టేందుకూ వెనుకాడనని తేల్చి చెప్పారు. రామచంద్రరావు సౌమ్యుడినే.. యుద్ధంలోకి దిగితే యోధుడినే.. కత్తి దూయడంలో ముందుంటానని చెప్పుకొచ్చారు. ఇక, తెలంగాణ ప్రజల తరపున అలుపెరుగని పోరాటం చేస్తానని తెలంగాణ కమలం పార్టీ అధినేత తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా, బీఎల్ సంతోష్ తదితరులు నాయకత్వంలో వారి సహకారంతో ముందుకెళ్తామన్నారు. 14 కోట్ల సభ్యత్వాలతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా భాజపా ఉంది. అలాంటి రాజకీయ పార్టీ రాష్ట్ర శాఖకు అధ్యక్షుడినయ్యా. తెలంగాణ అధ్యక్షుడిగా నన్ను ప్రకటించడం గర్వంగా భావిస్తున్నా. కార్యకర్తగానే పనిచేస్తా. పార్టీలో నాయకులంతా సమష్టిగా పనిచేస్తారు. కొత్తపాత తేడా లేదు.. ఎవరైనా భాజపాలో చేరినప్పటి నుంచే పార్టీ వ్యక్తులు. కొత్తనీరు రావాలి. యువత, మహిళలు భాజపాలో చేరాలి. పార్టీని బలపరచాలి. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి. కాంగ్రెస్ పార్టీ ఫేక్ న్యూస్ యూనివర్సిటీ నడుపుతోంది. భాజపా నేతలను ట్రోల్ చేస్తున్నారు. రామచందర్‌రావు సౌమ్యుడు కాదు. 14 సార్లు జైలుకు వెళ్లి వచ్చా. విద్యార్థుల కోసం పోరాడి పోలీసుల దెబ్బలు తిన్నాను. ప్రజాస్వామిక పద్ధతిలో ప్రభుత్వంపై పోరాటం చేస్తాను. తెలంగాణ ప్రజల కోసం పోరాడతాను. ప్రజలు, కార్యకర్తలు, నేతలు కలిసి రావాలి' అని రామచందర్‌రావు అన్నారు. కార్యక్రమంలో కిషన్ రెడ్డి, లక్ష్మణ్, ఈటెల, డికె అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# లిఫ్ట్ పేరుతో వివాహితపై అఘాయిత్యం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల పరిధిలో దారుణం చోటు చేసుకుంది. ఓ ఆర్ఎంపీ వైద్యుడు వివాహితపై అత్యాచారం చేసి ఆపై హత్య చేశాడు. లిఫ్ట్ పేరుతో బాధితురాలిని కారు ఎక్కించుకున్న సదరు దుర్మార్గుడు కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం గడ్డి మందు ఇంజెక్ట్ చేసి ఆమె ప్రాణాలు బలి తీసుకున్నాడు. తెలిసిన వ్యక్తి లిఫ్ట్ ఇస్తానంటే ఆ మహిళ కాదనలేకపోయింది. అమాయకంగా నమ్మి అతడి కారు ఎక్కింది. అప్పటికే నీచమైన ఆలోచనలతో ఉన్న ఆ దుర్మార్గుడు తనలోని మృగాన్ని నిద్రలేపాడు. కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా గడ్డిమందు ఇంజెక్ట్ చేసి ఆమె ప్రాణాలు బలి తీసుకున్నాడు. పోలీసులు సినీఫక్కీలో ఛేజ్ చేసిన ఆమె ప్రాణాలను కాపాడలేకపోయారు. ఈ దారుణ ఘటన నల్గొండ జిల్లా గుర్రంపోడ్ మండల పరిధిలో చోటు చేసుకుంది.

వివరాల్లోకి వెళితే.. గుర్రంపోడ్ మండల జూనూతుల గ్రామంలో మహేష్ అనే ఆర్ఎంపీ డాక్టర్ గత ఆరేళ్లుగా ఆసుపత్రి నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన వివాహిత (35) భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి మిర్యాలగూడలో నివాసం ఉంటుంది. వివాహిత అత్త వృద్ధాప్యంతో బాధపడుతూ స్వగ్రామంలోనే ఉంటుంది. ఆమెను చూసేందుకు గాను ఆదివారం (జూన్ 29) సాయంత్రం మిర్యాలగూడ నుంచి జూనుతల బయల్దేరింది. ఆ గ్రామానికి డైరెక్ట్ బస్ లేకపోవటంతో కొండ మల్లేపల్లిలో బస్సు దిగి.. జూనుతల బస్ కోసం ఎదురు చూస్తుంది. అంతలోనే మహేష్ అక్కడకు కారులో వచ్చాడు. 'నేను కూడా జూనూతుల వెళ్తున్నాను వస్తారా..?' అంటూ ఆమెతో మాట కలపాడు. గ్రామానికే చెందిన ఆర్ఎంపీ డాక్టర్ కావటంతో అతడి మాటలు నమ్మి కారు ఎక్కింది. కొద్దిదూరం వెళ్లగానే రోడ్డు పక్కన కారు ఆపి కూల్‌డ్రింక్ తీసుకున్నాడు. ఆమెకు తెలియకుండానే అందులో మత్తు మందు కలిపి ఇచ్చాడు. అది తాగిన కాసేపటికే వివాహిత మత్తులో జారుకుంది. ఇదే అదునుగా ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి మత్తులో ఉండగానే ఆమెపై అత్యాచారం చేశాడు. అనంతరం అక్కడి నుంచి నేరుగా నల్గొండ తీసుకెళ్లాడు. ఆమె అపస్మారక స్థితిలో ఉండగానే.. అక్కడ గడ్డమందు కొనుగోలు చేశాడు. అనంతరం రెండు చేతులకు గడ్డి మందు ఇంజెక్ట్ చేసాడు. అర్ధరాత్రి 12 తర్వాత కారులో జూనుతల బయల్దేరాడు. గుర్రంపోడ్ మండల కేంద్రంలో అప్పటికే పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి వేళ దేవరకొండ వైపు వెళ్తున్న ఒక కారు వేగంగా వెళ్లటాన్ని గమనించారు. గొర్రెల దొంగలు అయి ఉండొచ్చుననే అనుమానంతో కారును ఛేజ్ చేసే ప్రయత్నం చశారు. జూనూతుల స్టేజీ దాటి.. కాచారం స్టేజీ వైపు మలుపు తిరిగిన తర్వాత కారు డ్రైవర్ లైట్లు ఆర్పినట్టు పోలీసులు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆ వైపు వెళ్లగా.. ఒక వ్యక్తి కారులో నుంచి మహిళను కిందకి తోసివేసినట్లు గుర్తించారు.

అప్పటికే బాధితురాలి నోటి వెంట నురగలు వస్తుండటంతో ఆమె పరిస్థితి విషమంగా ఉందని గ్రహించిన పోలీసులు తమ వాహనంలోనే దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి, ఆపై మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు కోల్పోయారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించిన పోలీసులు ఆర్ఎంపీ మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. తానే గడ్డిమందు ఇచ్చి ఆమెను చంపేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. ఈ ఘటన జిల్లాలో సంచలనం సృష్టించగా.. నిందితుడికి కఠినంగా శిక్షించాలని వివాహిత బంధవులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కమిషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

**నిజామాబాద్:** బిఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన మూడేళ్లకే కాళేశ్వరం కూలేశ్వరంగా మారిందని ఇంఛార్జ్ మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. కేవలం కమిషన్ల కోసం కట్టిన ప్రాజెక్ట్ గురించి గొప్పలు చెప్పుకోవడం బిఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందన్నారు. మంగళవారం నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని నాశనం చేసిందని దుయ్యబట్టారు. 2014 తెలంగాణ నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత బిఆర్ఎస్ పార్టీ నిధులు, నియామకాలు అని చెప్పి నిధులన్నింటిని కెసిఆర్ కుటుంబసభ్యులు నీళ్లన్నీ ఫాంహౌస్ లోకి తరలించారని ఆరోపించారు. వరి వేస్తే రైతులకు ఉరి పడ్డట్టేనని అన్నారని, కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పండించిన రైతులకు రూ 500 బోనస్ ఇస్తుందని ప్రశంసించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలోని పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తుందని, అలాగే 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇళ్లకు కరెంట్ ఇస్తోందని కొనియాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం పదేళ్లలో కేవలం 60 వేల ఇళ్లు మాత్రమే మంజూరు చేసిందని, అందులో సగానికి పైగా బిల్లులు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజల్లోకి వెళ్లే విధంగా ప్రతికార్యకర్త కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టి పార్టీ కోసం పనిచేయాలని తెలిపారు. గ్రూపు రాజకీయాలతో పార్టీ స్థాయి తగ్గిపోతుందని కార్యకర్తలు, నాయకులను హెచ్చరించారు.

# రాష్ట్రంలో జోరు వానలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు రెయిన్ అలర్ట్ జారీ చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని చెప్పారు. కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలకు ఛాన్స్ ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఈ వర్షాలు ఉంటాయని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తెలుగు రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏపీ, తెలంగాణలకు అల్పపీడనం విస్తరించడంతో గత 24 గంటలుగా అనేక జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. ఈ అల్పపీడనం మరింత బలపడటంతో తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. మంగళవారం నుంచి మరో మూడు రోజుల వరకు తూర్పు తెలంగాణ ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. పలు జిల్లాల్లో ముసురుతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ములుగు, భద్రాద్రి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. మహబూబాబాద్, ఖమ్మం, జనగాం, యాదాద్రి, సిద్దిపేట, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, హన్మకొండ, వరంగల్, సిరిసిల్ల, నిజామాబాద్, నారాయణపేట్, మేడ్చల్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలకు ఛాన్స్ ఉందని చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ జిల్లాల్లో సాధారణ నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు.

ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా నల్లని మేఘాలు కమ్ముకోవడంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. పలు సోమవారం జూన్ 30 సాయంత్రం నుంచే ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. హైదరాబాద్ నగరంలోనూ భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నాన్‌స్టాప్‌గా కురిసిన వర్షంతో నగరం తడిసి ముద్దయింది. చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడగా.. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలా ఈ వర్షాలు రైతులకు ఆనందాన్ని కలిగిస్తుండగా.. హైదరాబాద్ నగర ప్రాంతాల్లో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. వర్షం కురిసే సమయంలో బయటకు వెళ్లొద్దని సూచించారు.

# పాశమైలారం ఘటన దురదృష్టకరం

**సంగారెడ్డి:** పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటన చాలా దురదృష్టకరమైన సంఘటన అని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 48 మంది మృతదేహాలు సంఘటన స్థలంలో లభ్యమయ్యాయని చెప్పారు. ఇంకా 11 మంది ఆచూకీ లభ్యం కావాల్సి ఉందన్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి తెలిపారు. మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారంలో ఘటన స్థలాన్ని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కొత్త అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావుతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సంస్థ ఫార్మా కంపెనీలకు రా మెటీరియల్ అందిస్తుందన్నారు. గతంలో సైతం ఒక పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ కారణంగా 11 మంది చనిపోయారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఉన్నతాధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రభుత్వానికి ఆయన సూచించారు. పరిశ్రమల్లో తనిఖీలు, లంచాల కోసం జరుగుతున్నాయా..? లేక నామ్ కే వాస్తే ప్రకారం జరుగుతున్నాయా..? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పొట్ట కూటి కోసం వచ్చి.. ఇలా ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంతో 46 మంది చనిపోవటం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. సిగాచి సంస్థలకు ఈ ఘటనలో మృతి చెందిన వారి జాబితా వచ్చిన తర్వాత ఆ యా రాష్ట్రాల వారికి తమ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆచూకీ తెలియకుండా పోయిన వారి కోసం త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పరిశ్రమల ప్రాంతంలో కచ్చితంగా అంబులెన్స్ ఉండే విధానం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఆ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహకరిస్తామని స్పష్టం చేశారు. శిధిలాల కింద మృతదేహాల కోసం పోలీస్ జాగిలాలను వినియోగించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. చనిపోయిన కుటుంబ సభ్యులు సొంత రాష్ట్రాలకు వెళ్లిపోతానంటే వారికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఇది రాజకీయాలు చేసే సమయం కాదంటూ విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాస్త ఘాటుగా సమాధానమిచ్చారు.

# శివసేనలోకి రాజాసింగ్..?

మొదటి పేజి తరువాయి



కొనసాగారు. ప్రస్తుతం తెలంగాణలో శివసేన ఉన్నప్పటికీ ఉనికి లో లేదనే చెప్పాలి. దీంతో చరిష్మా ఉన్న లీడర్ వస్తే పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశం ఉంది. ఈ క్రమంలో బీజేపీకి రాజీనామా చేసిన రాజాసింగ్ అటువైపు అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు రాజాసింగ్ ఉద్ధవ్ థాక్రేతో భేటీ అయ్యేందుకు రెడీ అవుతున్నట్టు సమాచారం. ఆయనకు పార్టీ రాష్ట్ర పగ్గాలు కూడా అప్పగించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

**ఉద్ధవ్ వెంటే నడుస్తారా..**

బాల్ థాక్రే స్థాపించిన శివసేన పార్టీ ప్రస్తుతం రెండుగా విడిపోయింది. ఒకటి ఉద్ధవ్ థాక్రే వర్గం మరొకటి షిండే వర్గం. షిండే వర్గం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలో అలయెన్స్ గా ఉంది. ఇక పోతే ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన పార్టీ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉంది. రాజాసింగ్ ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన వైపే అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. పాత బస్తీలో పేరున్న హిందూ నేతగా, గోరక్ష కు సంబంధించిన కార్యకపాలపాల్లో చురుగ్గా పాల్గొంటున్న రాజాసింగ్ శివసేనలో చేరితే ఆ పార్టీకి తెలంగాణలోనూ కొత్తగా స్థానం లభించే అవకాశం ఉంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పలు సీట్లను కూడా గెలుచుకుంటుందని తెలుస్తోంది.

**టీడీపీ ద్వారా రాజకీయాల్లోకి..**

తెలుగుదేశం పార్టీ ద్వారా రాజాసింగ్ రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన 2009లో మంగళ్ హాట్ డివిజన్ నుంచి జీహెచ్ఎంసీ కార్పొరేటర్ గా గెలుపొందారు. కాంగ్రెస్ కు పెట్టని కోటగా ఉన్న మంగళ్ హాట్ లో ఆయన గెలుపు అప్పట్లో సంచలనమనే చెప్పొచ్చు. 2014లో బీజేపీలో చేరి గోషామహల్ స్థానం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన రాజాసింగ్ విజయం సాధించారు. అప్పటి నుంచి ఆయన ఆ సెగ్మెంట్ నుంచి గెలుస్తూనే వస్తున్నారు. తాను హిందుత్వ ఎజెండాతోనే పనిచేస్తానని గతంలో పలుమార్లు చెప్పారు. ఈ క్రమంలో ఆయన శివసేన వైపే అడుగులు వేసే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

**డ్యామేజ్ కంట్రోల్**

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా తర్వాత పార్టీ అధినాయకత్వం డ్యామేజ్ కంట్రోల్ పై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోక్ సభ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసి ఓటమి చవి చూసిన మాధవీలతతో జాతీయ నాయకులు సునీల్ బన్సల్ భేటీ అయ్యారు. పాత నగరంపై పట్టు పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా గోషామహల్ లో ప్రత్యామ్నాయ నేతల కోసం ప్రయత్నించాలని సూచించినట్టు సమాచారం. ఇదే తరుణంలో గోషామహల్ టికెట్ ఆశించి భంగపడ్డ విక్రమ్ గౌడ్ తో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ చర్చలు జరిపినట్టు సమాచారం. ఆయనను యాక్టివ్ చేసేందుకు ఆమె ప్రయత్నాలు ప్రారంభించినట్టు తెలుస్తోంది.